గాంధీభవన్ మెట్లపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గ కార్యకర్తలు

గాంధీభవన్‌లో ప్లకార్డులతో నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు

రేవంత్‌రెడ్డి కాదు.. రేటెంతరెడ్డి!

- కాంగ్రెస్‌లో పెరుగుతున్న అసంతృప్తి
- రేవంత్‌కు వ్యతిరేకంగా నినాదాల హోరు
- గాంధీభవన్‌ను ముట్టడించిన మేడ్చల్ నియోజకవర్గ కార్యకర్తలు
- పాతబస్తీ నేతల బైఠాయింపు.. నిరసన
- టికెట్ల అమ్మకంపై అమరవీరుల స్థూపం వద్ద నిరసన
- కురువ విజయ్‌తోపాటు బహదూర్‌పుర నియోజకవర్గ నేతల సస్పెన్షన్

ఉప్పల్‌లో మీడియాతో మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి, చిత్రంలో పీసీసీ మాజీ కార్యదర్శి జితేందర్‌రెడ్డి

హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ)/కొల్లాపూర్: కాంగ్రెస్‌లో టికెట్ల లొల్లి మరింత ముదురుతున్నది. టికెట్ ఆశించి భంగపడిన ఆశావహులు గాంధీభవన్‌లో నిరసనను, ధర్నాలను కొనసాగిస్తున్నారు. అసంతృప్త నేతలు ఏకంగా గాంధీభవన్‌లో టెంట్లు వేసి ధర్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా పాతబస్తీకి చెందిన పలు నియోజకవర్గాల, గద్వాల, మేడ్చల్ కార్యకర్తలు గాంధీభవన్‌లోనే మకాం వేశారు. తమ నేతకు న్యాయం జరిగే వరకు గాంధీభవన్‌ను వీడేది లేదని తేల్చి చెప్తున్నారు. పీసీసీ చీఫ్ 'రేవంత్‌రెడ్డి కాదు.. రేటెంతరెడ్డి' అంటూ గాంధీభవన్ మెట్లపై రేవంత్‌కు వ్యతిరేకంగా భారీ ఎత్తున నినాదాలు చేశారు. గద్వాల నుంచి టికెట్ ఆశించిన కురువ విజయ్ తన నిరసనగళాన్ని మరింత పెంచారు. అమరవీరుల స్థూపం వద్ద రేవంత్‌కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. 65 టికెట్లను రూ.600 కోట్లకు అమ్ముకున్నారంటూ, రేవంత్ నాడు ఓటుకు నోటు.. నేడు సీటుకు నోటు సిగ్గు సిగ్గు అంటూ, కోట్ల రూపాయలకు టికెట్లు అమ్ముకున్న రేవంత్ ఖబడ్దార్ అంటూ, కాంగ్రెస్ టికెట్ ఫర్ సేల్ కేరాఫ్ రేవంత్ అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు.

గాంధీభవన్‌ను ముట్టడించిన మేడ్చల్ కార్యకర్తలు

మేడ్చల్ అభ్యర్థిగా వజ్రేశ్‌యాదవ్‌ను ప్రకటించడంతో అక్కడ పోటీపడుతున్న మరో నేత హరివర్ధన్‌రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఆదివారం పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టిన హరివర్ధన్‌రెడ్డి వర్గీయులు.. సోమవారం గాంధీభవన్‌ను ముట్టడించారు. అప్పుడే అక్కడ మీడియా సమావేశం నిర్వహిస్తున్న కొల్లాపూర్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావును అడ్డుకున్నారు. దీంతో ఆయన ప్రెస్‌మీట్‌ను మధ్యలోనే ఆపేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా వజ్రేశ్‌యాదవ్‌కు ఇచ్చిన టికెట్‌ను వెనక్కి తీసుకోవాలని, ఆ టికెట్‌ను హరివర్ధన్‌రెడ్డికి కేటాయించాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గాంధీభవన్ ఆవరణలోని రేవంత్ కటౌట్‌ను చించివేశారు. బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుల నిరసన రెండో రోజూ కొనసాగింది. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదలబోమని భీష్మించారు. కార్వాన్ టికెట్ ఉస్మాన్ బిల్ అల్‌హజరీకి బీఫాం ఇవ్వవద్దంటూ ఆ ప్రాంత నేతలు ఇన్‌చార్జి మాణిక్ ప్రభు ఠాకూర్‌కు వినతిపత్రం అందజేశారు.

నిలదీస్తే వేటే..

కాంగ్రెస్‌లో రేవంత్ పోకడలు శృతిమించాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏకస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నారని, అందుకే ప్రశ్నించే వాళ్లను చూసి ఓర్వలేకపోతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ఇందులో భాగంగానే తనకు టికెట్ దక్కకపోవడంపై ఆదివారం నుంచి నిరసన వ్యక్తం చేస్తున్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, గద్వాల నేత కురువ విజయ్‌కుమార్‌ను క్రమశిక్షణ కమిటీ సస్పెండ్ చేసింది. ఆయనతో పాటు బహదూర్‌పుర నేత ఖలీల్‌పై కూడా వేటు వేసింది. ఈ చర్యలపై పార్టీలోనే తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా అంటూ నిలదీస్తున్నారు. అధిష్ఠానం చర్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరసన తెలిపే హక్కు కూడా లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే గతంలో అధిష్ఠానంపై విపరీత వ్యాఖ్యలు చేసిన సీనియర్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీస్తున్నారు.

రేవంత్ తీరుతో గాంధీభవన్‌కు తాళం

రేవంత్ తీరుతో రెండు రోజులుగా గాంధీభవన్‌కు తాళం పడిందని, పారాచూట్ నేతలకు టికెట్లు అమ్ముకున్నారని పీసీసీ సభ్యుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు విమర్శించారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లిలోని తన ఫాంహౌస్‌లో కాంగ్రెస్ ఆశావహులు, పార్టీనేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశానికి చింతలపల్లితోపాటు మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి హాజరయ్యారు. జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ.. కొల్లాపూర్ నుంచి రెబల్‌గా బరిలో ఉంటానని ప్రకటించారు. నెల కిందట పార్టీలోకి వచ్చిన పారాచూట్ నేత జూపల్లి కృష్ణారావును కచ్చితంగా ఓడించి తీరుతామని ఈ సందర్భంగా శపథం చేశారు. నాగం మాట్లాడుతూ.. కొల్లాపూర్‌లో పార్టీని నమ్ముకొని ఉన్న జగదీశ్వర్‌రావుకు ఎందుకు టికెట్ కేటాయించలేదో రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

డీకే శివకుమార్ వద్దకు తెలంగాణ నేతల క్యూ

నిన్నటిదాకా ఢిల్లీ బాస్‌ల చుట్టూ తిరిగిన తెలంగాణ కాంగ్రెస్ నేతలకు హస్తిన మరింత దూరంగా మారింది. ఇప్పుడు నేరుగా కాకుండా వయా బెంగళూరు వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. పార్టీ టికెట్లు ఆశిస్తున్నవారు చాలామంది కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వద్దకు వెళ్లి పైరవీలు చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం టికెట్ ఆశిస్తున్న దండెం రాంరెడ్డి కుటుంబ సమేతంగా బెంగళూరు వెళ్లి డీకేను కలిశారు.

రేవంత్ నుంచి ప్రాణహాని..: పీసీసీ కార్యదర్శి విజయ్‌కుమార్

తెలుగు యూనివర్సిటీ/హైదరాబాద్, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ): రేవంత్ కాంగ్రెస్‌కు పట్టిన శని అని ఆ పార్టీ గద్వాల నేత, ఓయూ విద్యార్థి నాయకుడు డాక్టర్ కురువ విజయ్‌కుమార్ విమర్శించారు. అసెంబ్లీ సీట్లను రేవంత్ అమ్ముతున్నాడని ఆరోపిస్తూ సోమవారం హైదరాబాద్ గన్‌పార్కు అమరవీరుల స్థూపం వద్ద విజయ్‌కుమార్ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆనాడు ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన దొంగ రేవంత్.. నేడు సీటుకు నోటు అంటూ దోచుకుంటున్నారని మండిపడ్డారు. 65 సీట్లను రూ.600 కోట్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. గద్వాల టికెట్‌ను 10 కోట్లు, ఐదెకరాలు అమ్ముకున్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు టికెట్లు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారని.. కాంగ్రెస్ కోసం దశాబ్దాలుగా పని చేసిన వారిని పట్టించుకోకుండా ప్యారాచూట్ నేతలకు టికెట్లు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రకటించిన మొదటి లిస్టును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ అనుచరులు తనను చంపుతామని బెదిరిస్తూ రెక్కీ నిర్వహిస్తున్నారని, వెంటనే పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు. రేవంత్ అక్రమాలపై ఎన్నికల కమిషన్, ఈడీకి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

లోకం పోకడ



అది పార్టీ ప్రచారం కాదు.. టికెట్ల రేటు..
ఐదు ఎకరాలకు ఒక టికెట్ అని..

కాంగ్రెస్ ద్రోహి 'కూచుకుళ్ల'కు టికెట్

- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ (నమస్తే తెలంగాణ), అక్టోబర్ 16: కాంగ్రెస్‌ను నిరంతరం ఓడించడమే కాకుండా.. శాసన మండలిని అధికార పార్టీలో విలీనం చేసిన ద్రోహి కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కుటుంబానికి పార్టీ టికెట్ కేటాయించడం దారుణమని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాగం మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో చేరిన నాటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన తనకు టికెట్ కేటాయించకపోవడంపై టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టికెట్ల కేటాయింపులో ఉదయపూర్ డిక్లరేషన్‌ను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. సర్వే పేరుతో తనకు నమ్మక ద్రోహం చేశారని, ఎక్కడ సర్వే చేశారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యకర్తల అభిప్రాయాల మేరకే తన వైఖరిని ప్రకటిస్తానని నాగం చెప్పారు.

వర్షకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.7°c	19.3°c
రంగారెడ్డి	37.1°c	18.4°c
మెదక్	36.8°c	19.4°c
నల్లగొండ	35.4°c	23.0°c
నిజామాబాద్	35.4 °c	22.5°c
ఖమ్మం	35.0°c	21.0°c
కరీంనగర్	33.0°c	23.0°c
వరంగల్	33.0°c	23.0°c
మహబూబ్‌నగర్	32.8°c	23.7°c
హైదరాబాద్	32.5°c	22.5°c

మునుగోడు సీటుపై సీపీఐలో సిగపట్లు

- పల్లా, కూనంనేని మధ్య మాటామాట
- మునుగోడు కోసం నల్లగొండ నేతల పట్టు
- కాంగ్రెస్ తీరుపై సీపీఐ, సీపీఎం ఆగ్రహం
- సీట్లివ్వకుంటే.. ఒంటరి పోటీకి యోచన

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): మునుగోడు సీటు సీపీఐ రాష్ట్ర ముఖ్య నేతల మధ్య విభేదాలకు దారితీసింది. ఈ విభేదాలు సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో తీవ్ర చర్చ జరిగి తారస్థాయికి చేరాయి. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి పల్లా వెంకట్‌రెడ్డి మధ్య మాటామాట పెరిగినట్టు సమాచారం. కొత్త గూడెం సీటు కోసమే కూనంనేని తాపత్రయపడుతున్నారని, కాంగ్రెస్ పొత్తులో మునుగోడు సీటు కచ్చితంగా ఉండాల్సిందేనని పల్లా వెంకట్‌రెడ్డి గట్టిగా డిమాండ్ చేసినట్టు తెలిసింది. సీపీఐ కోరినట్టు బెల్లంపల్లి, మునుగోడు, వైరా, కొత్తగూడెం, హుస్నాబాద్ స్థానాలను కేటాయించాలని ఆ పార్టీ నేతలు పట్టుపడుతున్నారు. ఈ జాబితాలో చెన్నూరు లేకపోయినా కేటాయించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మునుగోడు సీటు కేటాయించాల్సిందేనని నల్లగొండ జిల్లా నేతలు పట్టుబడుతున్నారు. ఐదు స్థానాలు కేటాయించాల్సిందేనని, లేదంటే ఇతర వామపక్షాలతో కలిసి పార్టీకి బలమున్న చోట్ల పోటీ చేయాలని సీపీఐ కార్యదర్శివర్గం నిర్ణయించింది. ఈ విషయంపై మంగళవారం మరోసా సమావేశం కావాలని నిర్ణయించారు. పొత్తులో భాగంగా సీపీఎం భద్రాచలం, పాలేరు, మిర్యాలగూడ స్థానాలను కోరుతున్నది. కాంగ్రెస్ తన మొదటి జాబితాలోనే భద్రాచలం స్థానాన్ని సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు ఖరారు చేసింది. ఆయా స్థానాల్లో కాంగ్రెస్‌లోనే పోటాపోటీ నెలకొంది. దీంతో కాంగ్రెస్ ఆ మూడు కేటాయిస్తే కలిసి పోదాం, లేదంటే ఒంటరిగా పోటీ చేద్దామనే యోచనలో ఆ పార్టీ ఉన్నది. పొత్తు అంశం తేల్చడంలో కాంగ్రెస్ జాప్యం చేస్తుండటంపై వామపక్ష నేతలు ఆగ్రహంతో ఉన్నారు. ఇతర వామపక్ష పార్టీలతో కలిసి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, వామపక్షాల మధ్య పొత్తు కుదిరే అవకాశాలు కనిపించడం లేదు.

కాపీ ఎవరిది 'నకల్'రెడ్డి..?

- తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది.. అన్న సంగతి రేవంత్‌రెడ్డికి తెలియదా?
- బీఆర్ఎస్ పథకాలను కాపీ కొట్టిందెవరు?
- ఎవరికీ సాధ్యం కాని స్కీంలు తెలంగాణలో..
- పీసీసీ అధ్యక్షుని వ్యాఖ్యపై పురజనుల ధ్వజం

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): 'మందికి పుట్టిన బిడ్డను మన బిడ్డే అని ముద్దుపెకున్న డట ఒకడు' అని సీఎం కేసీఆర్ గతంలో చేసిన వ్యాఖ్య.. ప్రస్తుతం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేస్తున్న వాదనకు అచ్చుగుద్దినట్టు సరిపోతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ విడుదలచేసిన పార్టీ మ్యానిఫెస్టో తమ ఎన్నికల ప్రణాళికకు కాపీ అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొనటం కాంగ్రెస్ పార్టీ భావదారిద్ర్యానికి నిదర్శనమని అంటున్నారు. సోషల్ మీడియాలో ఇప్పటికే రేవంత్‌రెడ్డిని 'రేటెంత రెడ్డి' అని సెటైర్లు వేస్తుంటే.. ఆయన తాజాగా మ్యానిఫెస్టో విషయంలో చేసిన వ్యాఖ్యపై 'ఇట్లుంటదా... నకల్‌రెడ్డి' అని ఆట పట్టిస్తున్నారు. రేవంత్ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీలోనే అసంతృప్తి వ్యక్తమవుతున్నది. 'అబద్ధం ఆడినా అతికినట్టు ఉండాలె అంటరు కానీ, ఈ రేవంత్‌రెడ్డి ఏందో ప్రతీదానికి నా పనిత నమే అని అన్నీ తన ఖాతాలో వేసుకుంటడు' అన్న విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో దాదాపు అన్నింటినీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్నది. కేసీఆర్ పనితనాన్ని రేవంత్‌రెడ్డి సహిత చౌర్యం చేసి తానే సాధించిన అని చెప్పుకోవటం కాంగ్రెస్ పార్టీ భావదారిద్ర్యానికి నిదర్శన మనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాంగ్రెస్ పథకాలను బీఆర్ఎస్ కాపీ కొట్టిందా?

రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఉచిత చేపల పంపిణీ, సంచార పశువైద్యశాలలు, జిల్లాకో మెడికల్ కాలేజీ, కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషియన్ కిట్, గురుకులాల్లో సన్నబియ్యం, విదేశీ విద్యానిధి (ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్) ఇలా చెప్పుకుంటే పోతే చాంతాడంతా పొడవు పథకాలను సీఎం కేసీఆర్ విజయవంతంగా అమలు చేస్తున్నారు. 2004-2014 వరకు పదేండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అద్భుతంగా అమలు చేసిన పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం కాపీ కొట్టిందా? లేక గడచిన తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కేంద్రంతోపాటు, దేశంలోని అనేక రాష్ట్రాలు కాపీ కొట్టాయా? అంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం భగ్గుమంటున్నది. 'రైతులకు సంవత్సరానికి ఎకరానికి రూ.10వేల సాయం చేసే రైతుబంధు స్కీం 2018లో ప్రారంభించిన విషయం రేవంత్‌రెడ్డికి తెలియకపోయినా రాష్ట్రంలోని 6 5లక్షల మంది రైతులకు తెలియదా? ఏకారణంతో రైతు మరణించినా ఆ కుటుంబానికి రూ.5లక్షల రైతుబీమా అందజేస్తున్నది ఒక్క బీఆర్ఎస్ ప్రభుత్వమేనని దేశమంతా తెలిసినా రేవంత్‌రెడ్డికి తెలియదునుకోవాలా? తెలిసినా 'నవ్విపోదురుగాక నాకేటి' అన్నట్టు వ్యవహరిస్తున్నారా?'అన్న విమర్శలు వస్తున్నాయి.

'ఉత్తుత్తి' కాంగ్రెస్.. నోట్ దిస్ పాయింట్

'ఉత్తుత్తి బ్యాంక్.. ఉత్తుత్తి బ్యాంక్' అని ఓ సినిమాలో.. లేని బ్యాంకును ఉన్నట్టుగా చూపి హాస్యాన్ని పండించినట్టు.. కాంగ్రెస్ పార్టీ కూడా తాను ఇచ్చిన ఏ వాగ్దానాన్ని నెరవేర్చిన దాఖలాలు లేవు. అంతెందుకు 2004లో ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులకు 9 గంటల కరెంట్ ఇస్తామని చెప్పి అమలు చేయలేదు. పంజాబ్‌లో ఏకకాలంలో రూ.లక్ష రుణమాఫీ అని చెప్పి అధికారంలోకి రాగానే అక్కడ తూచ్ అన్నది. 2014లో తాము అధికారంలోకి రాగానే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని స్వయంగా రాహుల్‌గాంధీ ప్రకటించినా తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మకుండా కేసీఆర్‌కే జై కొట్టడం గమనార్హం.

పథకమెవరిది? కాపీ ఎవరిది?

'తెలంగాణ ఆచరిస్తున్నది.. దేశం అనుసరిస్తది' అన్న మాట తొమ్మిదిన్నరేండ్లుగా దేశ వ్యాప్తంగా వినిపిస్తున్నది. కేసీఆర్ ప్రవేశపెట్టి విజయవంతంగా అమలుచేస్తున్న అనేక పథకాలను కేంద్రం, పలు రాష్ట్రాలు కాపీ కొట్టిన దాఖలాలు అనేకం ఉన్నాయి. బీఆర్ఎస్ పథకాలను హైజాక్ చేయటమే కాకుండా 'దొంగే దొంగా..దొంగా' అని అరిచినట్టు రేవంత్‌రెడ్డి వ్యవహారం ఉన్నదని బీఆర్ఎస్ మండిపడుతున్నది.

తెలంగాణ పథకం	కేంద్రం కాపీ కొట్టి మార్చిన పేరు
రైతుబంధు	పీఎం కిసాన్ సమ్మాన్ నిధి
మిషన్ భగీరథ	హర్‌ఘర్ జల్
కల్యాణలక్ష్మి	పీఎం షాదీషగన్
మిషన్ కాకతీయ	అమృత్ సరోవరం
జిల్లాకో మెడికల్ కాలేజీ	జిల్లాకో మెడికల్ కాలేజీ
మన ఊరు-మనబడి	పీఎం శ్రీ స్కూల్స్
సంచార పశువైద్యశాల 1962	సంచార పశువైద్యశాల
బీసీబంధు	విశ్వకర్మ యోజన

ఇతర రాష్ట్రాలు అమలు చేసిన మన పథకాలు

మన పథకం	రాష్ట్రం
మన ఊరు-మన బడి	ఉత్తరప్రదేశ్, సీఎం అభ్యుదయ యోజన
రైతుబంధు	కర్ణాటక (రైతుసిరి పేరుతో)
రైతుబీమా	కర్ణాటక (జీవనజ్యోతి పేరుతో)

గుజరాతీ 'కోట్ల' కట్టలు

- వాడపల్లిలో రూ. 3 కోట్లు పట్టివేత
- వ్యాపారుల ముసుగులో తరలింపు
- బీజేపీ సొమ్మేనని రాజకీయనేతల ఆరోపణ
- ఇప్పటికే కర్ణాటకలో కాంగ్రెస్ డబ్బు రూ. 90 కోట్లు స్వాధీనం

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది మొదలు.. భారీ స్థాయిలో నోట్ల కట్టలు పట్టుబడుతున్నాయి. తెలంగాణకు తరలించడం కోసం దాచిపెట్టిన రూ.42 కోట్ల నగదును బెంగళూరులో ఓ కాంగ్రెస్ నేత ఇంటి నుంచి ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరో 45 కోట్లకు పైగా సొమ్మును కూడా అదే నగరంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా గుజరాత్ నుంచి తరలించిన రూ.3 కోట్ల నగదును తెలంగాణ పోలీసులు నల్లగొండలో స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారుల ముసుగులో ఇద్దరు గుజరాతీలు తరలిస్తున్న ఈ సొమ్ము గుజరాత్‌కు చెందిన బీజేపీ నేతలదేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో ఓటర్లకు నోట్లు ఎరవేసి ప్రలోభపెట్టేందుకు బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రయత్నిస్తున్నాయేమోనన్న సందేహాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తాము అధికారంలో ఉన్న కర్ణాటక, గుజరాత్‌ల నుంచి తెలంగాణకు కోట్ల రూపాయలను తరలించేందుకు ప్రయత్నిస్తున్నారన్న వాదనలు వస్తున్నాయి. గుజరాత్ నుంచి తరలించిన రూ.3.04 కోట్ల నగదును తీసుకెళ్తున్న కారు నల్లగొండ జిల్లాలో రెండుచోట్ల పోలీసులను ఏమార్చి ముందుకు దూసుకెళ్లింది. ముందుగా మాడ్గులపల్లి వద్ద పోలీసులు ఆపుతున్నా డ్రైవర్ ఆపకుండా ముందుకెళ్లాడు. దీంతో ఇక్కడి ఎస్ఐ మిర్యాలగూడ పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో మిర్యాలగూడ పోలీసులు ఏదులగూడ వద్ద సదరు కారును ఆపేందుకు ప్రయత్నించారు. అక్కడ కూడా డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోవడంతో పోలీసులు అంతర్ రాష్ట్ర సరిహద్దులను అప్రమత్తం చేశారు. మూడోసారి వాడపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు రోడ్డుకడ్డంగా బ్యారికేడ్లు పెట్టడంతో ఆ కారును ఆపక తప్పలేదు. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రంలో ఈ అక్రమ తరలింపు వెనుక ఉద్దేశమేమిటన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతోనే కోడ్ అమలులోకి రావడంతో పోలీసులు అడుగడుగునా తనిఖీలు చేపడుతున్నారు. పౌరులు రూ.50 వేల లోపు నగదును తమవద్ద ఉంచుకోవచ్చని, అంతకుమించి ఉంటే ఆ డబ్బుకు ఆధారాలు చూపాలని ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టంచేసింది. అయినప్పటికీ సరైన పత్రాలు లేకుండా లక్షల రూపాయల నగదును తరలిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని పలు చోట్ల నిర్వహించిన తనిఖీల్లో పోలీసులు దాదాపు రూ.3 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ గాంధీనగర్ పరిధిలోని కవాడీగూడలో రూ.2.09 కోట్లు, ఎల్బీనగర్ ఎస్‌వోటీ వద్ద కారులో తరలిస్తున్న రూ.29.40 లక్షలు, సైబరాబాద్ పరిధిలోని మాదాపూర్‌లో రూ.32 లక్షలు, గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో రూ.10 లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. సరైన పత్రాల్లేకుండా తరలిస్తున్న ఈ సొమ్మంతా ఎన్నికల్లో ఖర్చు పెట్టేందుకా? లేక ఓటర్లకు పంచేందుకా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రం తొమ్మిదేండ్లుగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో అధికార బీఆర్ఎస్ ప్రజల మన్ననలు పొందుతున్నది. ఇటువంటి పరిస్థితిలో ఓటర్లకు డబ్బు ఎరవేయడం తప్ప ప్రత్యర్థి పార్టీలకు వేరే మార్గం కనిపించడం లేదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. చైతన్యవంతులైన తెలంగాణ ఓటర్లు సంక్షేమాన్ని కోరుకుంటారు తప్ప డబ్బుకు అమ్ముడుపోరు అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ఉల్లంఘించిన కాంగ్రెస్

- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గోనె ధ్వజం

పెద్దపల్లి, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను ఉల్లంఘించిందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు విమర్శించారు. సోమవారం ఆయన పెద్దపల్లిలో మీడియాతో మాట్లాడారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో రెండు అసెంబ్లీ స్థానాలను బీసీలకు ఇస్తామని ఏఐసీసీ రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో డిక్లరేషన్ ప్రకటించి.. అమలు చేయకుండా ఉల్లంఘించిందని ఆయన మండిపడ్డారు. డిక్లరేషన్ మేరకు తెలంగాణలోని 17 పార్లమెంటు స్థానాల పరిధిలోని 34 అసెంబ్లీ స్థానాల్లో బీసీలకు అవకాశం ఇవ్వాల్సి ఉన్నదని సూచించారు. కానీ, ఇప్పటికే కాంగ్రెస్ ప్రకటించిన 55 అసెంబ్లీ స్థానాల్లో 12 స్థానాలను మాత్రమే బీసీలకు కేటాయించినట్టు చెప్పారు. ఆ 12 స్థానాల్లోనూ ఓడిపోయే అభ్యర్థులు ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిర్‌పోర్ట్ స అథారిటీలో..

న్యూఢిల్లీలోని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- పోస్టు: జూనియర్ ట్రాఫిక్ కంట్రోల్
- మొత్తం పోస్టులు: 496
- అర్హత: బీఎస్సీ ఫిజిక్స్ ఏదైనా విభాగంలో బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంపిక: దరఖాస్తు వెరిఫికేషన్, వాయిస్ టెస్ట్, సైకోయాక్టివ్ సబ్‌స్టాన్స్, మెడికల్ టెస్ట్ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 30
- వెబ్‌సైట్: https://www.aai.aero/en/careers/recruitment

ఏపీ నిట్‌లో..

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ వివిధ విభాగాల్లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- మొత్తం ఖాళీలు: 24
- పోస్టు: అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్
- విభాగాలు: బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ , మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్, హ్యూమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్
- అర్హత: సంబంధిత విభాగ